III
తెలంగాణ జైత్రయాత్ర 2023
నమస్తే తెలంగాణ
హైదరాబాద్ | మంగళవారం 31 అక్టోబర్ 2023 www.ntnews.com

సారు.. కారు..
ఈసారి గెలిచేది నూటా ఆరు
క్రికెట్‌లో విరాట్ చేజింగ్ మాస్టర్
తెలంగాణలో బీఆర్ఎస్ బ్లాక్‌బస్టర్

కాంగ్రెస్ అంటే మతకల్లోలం
బీఆర్ఎస్ ఉంటే మత సామరస్యం
నాడు బోర్లేస్తే కన్నీళ్లు
నేడు ఉబికొస్తున్న నీళ్లు

-విక్రమ్ రాథోడ్

**91827 77222**
హ్యాట్రిక్ ఎలక్షన్- హ్యాట్రిక్ కేసీఆర్ కాన్సెప్ట్‌తో అసెంబ్లీ ఎన్నికల స్పెషల్ 'తెలంగాణ జైత్రయాత్ర'కు మీ నినాదాలు పంపాల్సిన వాట్సాప్ నెంబర్ ఇదీ.. మీ పేరు, ఫొటో పంపడం మర్చిపోకండి.

ఫన్‌టాస్టిక్



# లిస్టు రెడీ!

**'పదవికి ముందు.. ఎన్నికల్లో వెనుక' ఉండే రెడ్డి గారికి ఢిల్లీ పెద్దలు 'అధికారం మనదే పో' అన్నరు. 'సచ్చినోడి పెండ్లికి వచ్చిందే కట్నమన్నట్టు' ఎన్నికల్లో గెలువకున్నా ఎన్నికల లీడరు అయినందుకు రెడ్డి చానా హుషారు మీద హైదరాబాద్ బయలెల్లిండు.**

ఢిల్లీ లీడరు ఇచ్చిన చిట్టీ జేబుల ఆపెట్టుకొని గల్లీ పోరుకు బయలెల్లిండు రెడ్డి. ఆఫీసు బయటికొచ్చి కారెక్కిండో లేదో.. 'నీకిచ్చిన చిట్టీల ఉన్న పేర్లలో మూడు తీసెయ్ ఆల్లు పార్టీ మారింద్రు' అని ఢిల్లీ సార్ ఫోన్‌ల చెప్పిండు.

'గట్లనే సార్' అనుకుంట రెడ్డి ఫోన్ పెట్టేసిండు.

బేగంపేటల ఫ్లైట్ దిగి, జోర్దారుగా నడుసుకుంట బయటికొచ్చిండు రెడ్డి. ఫోన్ తీసిండు. 'పార్టీకి బైబై' అంటూ ఓ పాతిక మంది దాంక 'గుడ్ బై మెసేజ్‌లు' పెట్టిన్రు. రెడ్డికి నీరసమొచ్చింది. కార్ల కూకోని లిస్టుల పేర్లు కొట్టేసుకుంట పోయిండు.

ఆఫీసు ముందు కారు దిగంగనే 'ఏరయ్యా మనవాళ్లు?' అని ఆఫీస్ సెక్రటరీని ఆవేశంగా అరిచిండు రెడ్డి సారు. 'ఆశావహులంతా వచ్చింద్రు సారు. అగో ఆడున్నరు' అంటూ పక్కకు సూపిచ్చిండు. అటో శవయాత్ర.. ఆశావహులంతా దింపుడుకల్లం చూస్తున్నరు. 'ఛీఛీ' అంటూ భవిష్యత్‌ని అసహ్యించుకుంటూ ఆఫీసులోకి పోయిండు రెడ్డి.

**కాన్ఫరెన్స్ హాల్ అందమైన ఇంటీరియర్‌తో కళకళలాడుతున్నది. కానీ, కిటకిటలాడే క్యాడరే లేదు! 'ముఖ్యులే రానట్టున్నరే' అని వచ్చి నోల్లని లెక్కవెడుతూ అడిగిండు రెడ్డి.**

'రాకపోతే లేనట్టే' అని పార్టీల కొత్తగ జేరిన జంప్ జిలానీ చెప్పిండు.

'నువ్వు చెప్పినవంటే నమ్మొచ్చు' అంటూ రెడ్డి కుర్చీల కూలవడ్డడు. వచ్చిన నలుగురు ఆయనకు ఇరుపక్కలా కూకున్నరు. రెడ్డి ప్రెస్ మీట్ మొదలువెట్టిండు.

ఆగమేఘాల మీద వచ్చిన ప్రెస్సోళ్లు 'మీ పార్టీ టాప్ లీడర్లు అధికారపార్టీతో టచ్‌లో ఉన్నరంట' అనడిగింద్రు.

'పోటీ పార్టీ ఏజెంట్లలెక్క పనిజేస్తున్నరా? నా పక్కనే ఉన్నోడు పక్క పార్టీలా జేరతాండనబట్టిరి... ఆ' అని రెడ్డి గద్దించి మాట్లాడిండు.

**'ఏడి సారూ' అని ప్రెస్సోళ్లు అనంగనే.. 'ఇగో' అనుకుంట పక్కకు తిరిగిండు రెడ్డి. సీట్ల ఆ మనిషి లేడు. రెడ్డికి అనుమానం గొట్టింది.**

'వాష్ రూమ్‌కి పోయిండు' అని ఎమ్మటే కలరింగిచ్చిండు. గాయబ్ అయిన లీడర్ అంతల్నే కలర్ టీవీల కనపడ్డడు. రెడ్డికి సినిమా కనవడింది. చిట్టీల ఇంకో పేరు కొట్టేశిండు.

'పట్టుమని పది మంది లేర'ని పక్కనే ఉన్న గడల రాజేందర్ కెల్లి జూసిండు రెడ్డి.

'ఏం గాదు. క్యాండేట్లు లేకపోతే. ఏమైంది? అసలే మనది కమర్షియల్ పార్టీ. మార్వాడీ మాల్ ఎట్లమ్ముతరో ఎర్కేగా! ఒకటి కొంటె ఒకటి ఫ్రీ లెక్క ఒక టికెట్ అడిగితే రెండు టికెట్లిద్దం, నువ్వో నాలుగు చోట్ల, నేనో రెండు చోట్ల పోటీ జేద్దం' అని గడల రాజేందర్ చెప్పిండు.

**బుర్ర గోక్కుంటున్న రెడ్డి 'అబ్బ భలే ఐడియా' అన్నడు. కానీ, రెడ్డికి భయం పట్టుకున్నది. 'అసలే పెద్ద పదవిల ఉంటి, ఓడిపోతే పరువు పోదా' అనుకుని, 'నాలుగు గాదు ఒక్క చోటా పోటీ చేయ' అన్నడు.**

'నేను పోటీకి దిగుతా.. పోరాడితే పోయేదేమీ లేదు! నా సిట్టింగ్ సీటు తప్ప. ఇట్లయినా గెలువ. అట్లయినా గెలువ. సీఎం నియోజక వర్గంల గూడ పోటీకి దిగుత రాసుకో పేరు!' అన్నడు రాజేందర్. తగ్గుతా తగ్గుతా కురసైపోయిన లిస్టు ఒక్క లైను పెరిగే సరికి రెడ్డి ఊపిరి పీల్చుకున్నడు.

**'సీఎంపై పోటీ' అని రెడ్డి ప్రెస్‌మీట్‌లో ప్రకటించంగనే ముఖ్యమంత్రి కుర్చీల కూసున్నంత గర్వంతో రొమ్ము విరుచుకున్నడు రాజేందర్.**

కెమెరా, మైక్‌లకు కనెక్షన్ సరిగా లేక ఇబ్బంది పడుతున్న ఓ జర్నలిస్టు అన్న వస్త్రాలకు పోతే ఉన్న వస్త్రాలు పోయినయని గొణుక్కుంట ఏదో దేవులాడుతున్నడు. ఆ మాటకు రాజేందర్ ప్యాంటు గట్టిగ పట్టుకున్నడు. అదేమిటో అదే టైంల రెడ్డి గూడ గట్లనే రియాక్ట్ అయిండు! పాపం!

▪ వర్ధన్

## నాడు-నేడు

• భూత్ బంగ్లా బడి..



తెలంగాణ ప్రాంత ప్రజల బాగోగుల పట్ల గత పాలకులు నిర్లక్ష్యం చూపని రంగమంటూ లేదు. అలాంటి వాటిలో రాష్ట్ర అభ్యున్నతికి బాటలు వేసే విద్య కూడా ఉన్నది. దానికి ఆనవాలే ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవంతి. వరంగల్ జిల్లాలోని మట్వాడ గ్రామంలోనిది. భూత్‌బంగ్లాను తలపిస్తూ కనిపిస్తున్న ఈ భవనంలోనే చిన్నారులు చదువుకునేవారు. ఎప్పుడు గోడలు కూలుతాయో.. పైకప్పు ఊడి మీద పడుతుందో తెలియని స్థితిలో బిక్కుబిక్కు మంటూ పాఠాలు వినేది.

• చూడచక్కని చదువుల ఒడి..!



తెలంగాణ రాష్ట్రం వచ్చాక పాఠశాల విద్యకు ఎర్ర తివాచీ పరిచారు సీఎం కేసీఆర్. పిల్లలు బడి బాట పట్టాలంటే పాఠశాల భవంతులు చక్కగా ఉండాలన్న ఉద్దేశంతో వాటి నిర్మాణాన్ని చేపట్టారు. సర్కారు బళ్లలో నమోదు, హాజరు, ఉత్తీర్ణత శాతాలను పెంచేలా 'మన ఊరు మన బడి' కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. మట్వాడ గ్రామంలో వెలసిన పాఠశాల భవనం ఇందుకు నిదర్శనం. శుభ్రమైన పరిసరాలు.. చూడచక్కని భవంతి..ఇప్పుడు చదువంటే ఇక్కడి పిల్లలకు పండుగే!



కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయం

# షబ్బీర్ గబ్బు పట్టిచ్చిండు..

**రెండుసార్లు మంత్రిగా.. చేసింది శూన్యం**
- 'గంప'గుత్తగా కామారెడ్డి అభివృద్ధి
- కొత్త జిల్లాతో ప్రజలకు చేరువైన పాలన
- మెడికల్ కళాశాలతో మెరుగైన వైద్యం
- కామారెడ్డి పట్టణానికి కొత్త కళ

**మూడు జాతీయ రహదారుల కూడలిలో ఉంటుంది కామారెడ్డి. అభివృద్ధికి అన్ని రకాలుగా అవకాశం ఉన్న ప్రాంతం ఇది. కానీ, పదేండ్ల కింది వరకు పాలకులకు ఏనాడూ అభివృద్ధి పట్టలేదు. ఇక్కడి నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ నేత షబ్బీర్ అలీ రెండుసార్లూ మంత్రి పదవిని అనుభవించారు. కానీ, ఆయనను గెలిపించిన ప్రజలకు మాత్రం కష్టాలనే మిగిల్చారు.**

కామారెడ్డి కహాని

కేసీఆర్ సర్కార్ వచ్చాకే కామారెడ్డికి కొత్త కళ వచ్చింది. అభివృద్ధి పరుగులు పెడుతున్నది. పదేండ్లలోనే దశ మారింది. కామారెడ్డి జిల్లా కేంద్రమైంది. దశాబ్దాల కల అయిన మెడికల్ కళాశాల ఏర్పాటైంది. గతంలో 14 చదరపు కిలోమీటర్లుగా ఉన్న కామారెడ్డి పట్టణ విస్తీర్ణం నేడు 61.50 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. కామారెడ్డి అభివృద్ధిని చెప్పేందుకు ఇదొక్కటే నిదర్శనం.

### పల్లెల్లో అభివృద్ధి పరుగులు

నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలు కూడా కేసీఆర్ పాలనలో పదేండ్లలో సమూలంగా మారిపోయాయి. రూ.15 కోట్లతో టేక్రియాల్ నుంచి నర్సన్నపల్లి, నిజాంసాగర్ చౌరస్తా నుంచి లింగాపూర్‌కు నాలుగు లైన్ల రోడ్డు



సుందరీకరణతో అద్భుతంగా కనిపిస్తున్న రహదారి

వేశారు. మాచారెడ్డి మండలంలో రూ.100 కోట్లు, బీబీపేట్ మండలంలో రూ.48.61కోట్లు, దోమకొండ మండలంలో రూ.32.27 కోట్లు, భిక్కనూర్ మండలంలో రూ.100 కోట్లు, రాజంపేట మండలంలో రూ.59 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం, విద్యుత్ వ్యవస్థ క్రమబద్ధీకరణ, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పంచాయతీ కార్యాలయాల నిర్మాణం, వైకుంఠధామాల ఏర్పాటు వంటి అనేక పనులు జరిగాయి.

### షబ్బీర్ చేసింది శూన్యం..

1989లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన షబ్బీర్‌అలీ మొదటిసారే మంత్రిగా పని చేశారు. తరువాత 2004లో రెండోసారి గెలిచి మళ్లీ మంత్రి అయ్యారు. రెండుసార్లు మంత్రిగా పనిచేసినా ఆయన చేసిన అభివృద్ధి శూన్యం. విద్యుత్ శాఖ మంత్రిగా షబ్బీర్ పని చేసినప్పుడు అనుభవించిన కరెంటు కష్టాలు కామారెడ్డి రైతులకు ఇంకా కండ్ల ముందే కదలాడుతున్నాయి. అవకాశం ఉండి కూడా అభివృద్ధి చేయడంలో షబ్బీర్ విఫలమైనందునే ఆయనను గత నాలుగు ఎన్నికలలో కామారెడ్డి ప్రజలు తిరస్కరించారు.

**మాడల్ టౌన్‌గా కామారెడ్డి**

**కేసీఆర్ ప్రభుత్వ పాలనలో కామారెడ్డి పట్టణంలోనే సుమారు రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ఈ పనుల్లో ముఖ్యమైనవి ఇవి..**
- సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం
- జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణం
- సువిశాల ప్రాంగణంలో మెడికల్ కాలేజీ
- రూ.13 కోట్లతో కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.6 కోట్లతో కళాభారతి ఆడిటోరియం
- రూ.4.50 కోట్లతో మాడల్ మార్కెట్
- రూ.3 కోట్లతో జంక్షన్ల అభివృద్ధి
- రూ.1.65 కోట్లతో సెంట్రల్ లైటింగ్
- రూ.1.60 కోట్లతో 4 పార్కుల అభివృద్ధి
- రూ.2 కోట్లతో వైకుంఠధామాల అభివృద్ధి
- రూ.5 కోట్లతో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం
- కోటి రూపాయలతో జిల్లా గ్రంథాలయం అభివృద్ధి
- పట్టణంలో కళాభారతి నిర్మాణం
- రోడ్ల విస్తరణ, లైటింగ్, సుందరీకణ పనులు
- మురుగునీటి వ్యవస్థ క్రమబద్ధీకరణ




### కేసీఆర్ పోటీతో జోష్

**ఈ ఎన్నికల్లో స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం ఇక్కడి జనంలో జోష్ నింపింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గంప గోవర్ధన్‌ను గెలిపించినప్పుడే నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారమై అభివృద్ధి మొదలైంది. ఇప్పుడు నేరుగా కేసీఆరే పోటీ చేస్తుండటంతో ఇక కామారెడ్డి అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకం ప్రజల్లో నెలకొన్నది. అందుకే ఊర్లకు ఊర్లు కేసీఆర్‌కే తమ మద్దతు అంటూ తీర్మానాలు చేస్తున్నాయి.**

ద లీడర్..



# ఉద్యమమే ఊపిరిగా...

## సభలు సక్సెస్ 'పెద్ది' సొంతం..
## కేసీఆర్‌కు కరుడుగట్టిన సైనికుడు

**తెలంగాణ ఉద్యమానికి ఓరుగల్లు ముఖచిత్రం. బీఆర్ఎస్ పార్టీకీ, అధినేత సీఎం కేసీఆర్‌కు పోరాటాల పురిటిగడ్డ మొదటి నుంచీ అండగా నిలిచింది. గులాబీ దళపతి కేసీఆర్ ఉద్యమ టీమ్‌లో జిల్లా పార్టీ కన్వీనర్‌గా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పెద్ది సుదర్శన్‌రెడ్డి పనిచేశారు. తన ఐదు టర్ముల్లో పదేండ్లు జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. యువతకు అవకాశాలు కల్పిస్తే ఉద్యమానికి ఎలా తోడ్పడతారో 'పెద్ది' నిరూపించారని కేసీఆర్ అనేక సందర్భాల్లో ఆయనను ప్రశంసించారు.**

సామాన్య మధ్యతరగతి వర్గానికి చెందిన సుదర్శన్‌రెడ్డి నర్సంపేట నియోజకవర్గంలోని నల్లబెల్లి మండలం సొంత గ్రామంలో యూత్ క్లబ్‌ను ప్రారంభించారు. అదే ఆయన రాజకీయ జీవితానికి నాంది పలికింది. దుగ్గొండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. రాజకీయాల్లో రాటుదేలుతున్న క్రమంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ఆవిర్భవించింది. అందులో ఆయన చేరారు.

### అవినీతిని ఎండగట్టి...

పెద్ది సుదర్శన్‌రెడ్డి చురుకుదనం చూసి బీఆర్ఎస్ జడ్పీటీసీగా పోటీచేసే అవకాశం కల్పించింది. జడ్పీటీసీగా గెలిచిన ఆయనను పార్టీ జడ్పీ ఫ్లోర్ లీడర్‌ను చేసింది. వరంగల్ జడ్పీ టీడీపీ చేతుల్లో ఉన్నది. చైర్మన్‌గా బస్వారెడ్డి అవినీతికి పాల్పడ్డారని ఆధారాలతో నిరూపించటంలో 'పెద్ది' క్రియాశీలకంగా వ్యవహరించారు. ఫలితంగా బస్వారెడ్డి తన జడ్పీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

### పోరాట పథంలో..

బీఆర్ఎస్ పార్టీకి, సీఎం కేసీఆర్‌కు కరుడుగట్టిన సైనికుడిగా సుదర్శన్‌రెడ్డి తనను తాను మలచుకున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని మలుపుతిప్పే అనేక ఘటనలకు వేదిక వరంగల్. పార్టీ ఇచ్చిన ఉద్యమ కార్యాచరణ నూటికి నూరుపాళ్లు వరంగల్‌లో విజయవంతం అయ్యేది.'పెద్ది' అధ్యక్షుడిగా ఉన్న కాలంలో జరిగిన మానుకోట ఘటన, రాయినిగూడెం తిరుగుబాటు వంటి అనేక ఘటనలు తెలంగాణ ఉద్యమ చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిపోయాయి. తెలంగాణ జైత్రయాత్ర, తెలంగాణ విశ్వరూప సభ, తెలంగాణ మహాగర్జన.. దేశ, అంతర్జాతీయ చరిత్రలో తెలంగాణ మహాగర్జనకు 20నుంచి 25 లక్షల మంది హాజరై తెలంగాణ ఆకాంక్షను ఆవిష్కరించారు. 'ప్రపంచంలోనే అత్యధిక మంది హాజరైన సభల్లో తెలంగాణ మహాగర్జన రికార్డు సృష్టించింది.

'పెద్ది'ఉద్యమ నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకొని పార్టీ అధినేత కేసీఆర్ ఆయనను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డి నర్సంపేట ఎమ్మెల్యేగా గెలిచారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన మెడికల్ కాలేజీని నర్సంపేటలో నెలకొల్పటంలో పెద్ది పాత్ర పెద్దది.



▪ స్వశక్తి

# గిరి మహిళలకు చేయూత

## పారిశ్రామికవేత్తలుగా రాణింపు

ప్రభుత్వం గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి అనేక పథకాలు తీసుకువచ్చింది. వాటి ఆర్థిక సహకారంతో పారిశ్రామిక రంగంలో రాణిస్తున్నారు. స్వయంగా లాభాలు ఆర్జిస్తున్నారు. తమ కాళ్లపై తాము నిలబడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం సమీపంలోని చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 10 మంది మహిళలు గిరిజన మహిళా సంఘంగా ఏర్పడ్డారు. స్వయంగా ఉపాధిని పొందాలని భావించారు. అధికారులను సంప్రదించి ఐటీడీఏ ఆర్థిక సహకారంతో 'శ్రీ ఆంజనేయ డ్రైమిక్స్ ఇండస్ట్రీస్'ను స్థాపించారు.

### చిరుధాన్యాలతో ఉత్పత్తులు..

డ్రైమిక్స్ ఇండస్ట్రీస్‌లో జొన్నలు, మినుములు, వేరుశనగ, జీర, రెడ్‌చిల్లీ, ఆవాలు,



ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

సాల్ట్ పౌడర్, కొర్రలు, పెసర, మిరియాలు, ధనియాలు, సజ్జలు, చక్కర, బాదం, బొంబాయి రవ్వ, యాలకులు, టర్మరిక్.. ఇలా 20 రకాల పదార్థాలతో స్వీట్‌మిల్, మల్టీగ్రేన్, జవార్‌మిల్‌ను తయారు చేస్తున్నారు. గిరి బ్రాండ్ పేరిట ప్యాకింగ్ చేసి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఇది ఎంతగానో దోహదపడుతుంది. ఈ పరిశ్రమ ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేస్తున్నారు.



**కలిసికట్టుగా పనిచేస్తున్నం**

**ఐటీడీఏ, సెర్ప్ ద్వారా ఆర్డర్లు వస్తున్నయి. మూడు రకాల ఉత్పత్తులు చేసి విక్రయిస్తున్నం. మంచి లాభాలు వస్తున్నయి. ఒక్కో నెలలో ఒక్కోరకంగా ఆర్డర్లు ఉంటయి. కలిసికట్టుగా పనిచేసి లాభాలు పంచుకుంటున్నం.**

- మంజుల, అధ్యక్షురాలు